# జైహింద్
## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**వార్నర్** మరో ఇద్దరు సహాయకులతో కలసి కారులో ఉన్నాడు. కారు కూడా మిలటరీది కాదు. ఎవరిదో పర్సనల్ కారు. వారందరు ఆ కారులో శనివారం తెల్లవారుజామునే సంతోష్ ఇంటి వైపు బయలుదేరారు.

సంతోష్ ఏదో అర్జంటు పని వచ్చిందని, శనివారం పనికి రాలేనని ముందు రోజే అడిగి సెలవు తీసుకున్నాడు. ఏ మాత్రం వ్యతిరేకించకుండా వెంటనే సెలవు ఇచ్చాడు వార్నర్.

శనివారం ఉదయం నుండి సంతోష్ మీద నిఘా మొదలు పెట్టాలనుకున్నారు.

అతని ఇంటి దాకా వెళ్లాక, ఆ ప్రాంతంలో కారు నిలపటం అంటే అందరి దృష్టిని తమ వైపు ఆకర్షించటమే అని అర్థమయింది వార్నర్ బృందానికి.

ఒక వ్యక్తిని మాత్రం ఆ ఇంటిని గమనించటానికి ఉంచి, మిగిలిన వారు మెయిన్ రోడ్డులో ఆపిన కారులో కూర్చున్నారు. ప్రతి రెండు గంటలకు కారులో నుండి మరొకరు వెళ్లి అక్కడ ఉన్న వ్యక్తిని వెనక్కి పంపుతున్నారు.

వారి నిరీక్షణ ఎట్టకేలకు ఫలించి మధ్యాహ్నం రెండు గంటలకు సంతోష్ బయటకు వచ్చాడు. తన పాత సైకిల్ మీద ఎక్కి అతను బయలుదేరాడు.

ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని వార్నర్ ముందుగానే ఊహించాడు. అతని కారు మీద రెండు సైకిళ్లు కట్టి ఉన్నాయి. వాటిని తీసుకుని వార్నర్ మనుషులు సంతోష్ వెనుక బయలుదేరారు. ప్రతి వంద గజాలకు కొత్త వారు అనుసరిస్తుంటే పాత వారు పక్కకు వెళ్లి పోతున్నారు.

వీరికి దూరంగా వార్నర్ కారులో అనుసరిస్తున్నాడు.

ఎట్టకేలకు సంతోష్ ఎక్కిన సైకిల్ బాలీగంజ్‌లోని క్వీన్ ఆఫ్ పీస్ చర్చ్ ముందు ఆగింది. దానిని పార్కింగ్ స్థలంలో పెట్టి చర్చిలోకి నడిచాడు సంతోష్. అతను వస్తున్నంత సేపూ తనను ఎవరన్నా అనుసరిస్తున్నారేమో అని గమనించుకుంటూనే ఉన్నాడు. కానీ తనను అనుసరిస్తున్న వారిని గుర్తించలేక పోయాడు.

అతను చర్చిలోకి ప్రవేశించి అక్కడ వేసి ఉన్న బెంచీల వైపు నడిచాడు. కుడి వైపు ముందు నుండి మూడవ బెంచీకి చివర కూర్చున్నాడు.

అప్పటికే వేషం మార్చుకున్న వార్నర్, సంతోష్ తనకు కనపడేటట్లు మూడు బెంచీల వెనుక కూర్చున్నాడు.

నిమిషాలు గడిచి గంటలు అవుతున్నాయి. కానీ సంతోష్‌ని కలుసుకోవటానికి ఎవరూ రాలేదు. చర్చికి వచ్చే వారు వస్తున్నారు, వెళ్లే వాళ్లు వెళ్తున్నారు.

వార్నర్ మదిలో మొట్టమొదటిసారి అసలు తనకు అందిన సమాచారం సరయినదేనా అన్న అనుమానం మొదలయింది.

మరో గంట గడిచింది.

అయినా సంతోష్‌ని కలుసుకోవటానికి ఎవరూ రాలేదు.

ఇంతలో ఒక స్త్రీ వచ్చి వార్నర్ పక్కన కూర్చుంది.

ఆమె ఎవరా అన్నట్లు తల పక్కకు తిప్పి చూశాడు వార్నర్.

అదే సమయంలో అతని వైపు చూసిన ఆ స్త్రీ, “హాయ్! అయామ్ ఫ్లోరెన్స్...” అని పరిచయం చేసుకుంది.

ఈ సంఘటన జరగటానికి మూడు గంటల ముందు...

మధుబాల, ఫ్లోరెన్స్ కలకత్తా వచ్చారు. అనుకున్న చోటుకు వెళ్లటానికి, సంతోష్‌ని కలుసుకోవటానికి ఇంకా చాలా సమయం ఉంది. డబ్బుకు ఇబ్బంది లేదు కాబట్టి ఒక హోటల్ అద్దెకు తీసుకుని విశ్రాంతి తీసుకున్నారు.

“మనం చేపట్టిన కార్యం ఎలా జరుగుతుందనుకుంటున్నావ్?” అడిగింది ఫ్లోరెన్స్.

“ఏం చెప్తాం ఫ్లోరెన్స్? అక్కడ పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలి...”

“చిన్న పిల్లని అనుకోక పోతే, నన్నొక మాట చెప్పమంటావా?”

మధుబాల నవ్వుతూ చూసింది.

“కలకత్తా బ్రిటిషు వారికి పెట్టని కోట. కొన్ని సంవత్సరాల క్రితం వరకు దేశ రాజధాని. వందల సంవత్సరాలుగా బ్రిటిషు వారి వాణిజ్య రాజధాని. అసలు ఈ నగరాన్ని నిర్మించిందే వారు...”

“అయితే...” ఆమె ఏమి చెప్తుందో అర్థం కాక అడిగింది మధుబాల.

“మన గూఢచారి ఎన్నో రోజులుగా ఇక్కడ సమాచారం సేకరిస్తూ వస్తున్నాడు. రేడియో ద్వారా మనకు మెసేజులు పంపుతున్నాడు. కానీ ఎంతో సాధన సంపత్తి ఉన్న బ్రిటిషు వ్యవస్థ ఇన్ని రోజులుగా అతన్ని పట్టుకోలేక పోయిందంటే నమ్మబుద్ధి కావటం లేదు.”

“అంటే!... పట్టుకోగలిగి పట్టుకోవటం లేదంటావా?” అయోమయంగా అడిగింది మధుబాల.

“అది ఒక అభిప్రాయం. లేదూ... అతన్ని ఎరగా వేసి మనల్ని పట్టుకోవాలనుకుంటున్నారేమో?”

మధుబాల కూడా ఆలోచనలో పడింది. అలాంటి ఆలోచన ఇప్పటి వరకు ఆమెకు రాలేదు. “నీ ఉద్దేశం ఏమిటి?”

“మనం కూడా అనుకున్న ప్రదేశానికి ముందే వెళ్దాం. మన గూఢచారిని ఎవరన్నా అనుసరిస్తున్నారేమో గమనిద్దాం...”

“ఒకవేళ మన ఏజెంటును ఎవరన్నా అనుసరిస్తున్నట్లు గుర్తిస్తే ఏం చేద్దాం? వెనక్కి వెళ్లిపోదామా? ఇక్కడకు వెంబడించిన వాళ్ళు అతని మీద ఇరవై నాలుగు గంటల నిఘా పెట్టరా? అలా అయితే అతన్ని అసలు కలుసుకోలేము కదా... మరి మనం ఇక్కడకు వచ్చిన లక్ష్యం ఎలా నెరవేరుతుంది?”

“అక్కర్లేదు మధుబాలా! ఎవరికీ లేని సానుకూలత నీకు ఒకటి ఉంది. దానిని ఉపయోగించుకో...”

“నాకు ఉన్న సానుకూలతా? ఏమిటది?”

“నేనే!!!...” అంది ఫ్లోరెన్స్. అర్థం కానట్లు చూస్తున్న మధుబాలతో, “ఒక బ్రిటిషు యువతి ఆజాద్ హింద్ ఫౌజు తరుపున గూఢచర్యం చేస్తుందని చెప్తే ఎవరన్నా నమ్ముతారా? నమ్మరు. కాబట్టి ఇక్కడ నన్ను ముందుకు జరుపు. మిగిలింది నేను చూసుకుంటాను...” అంది.

అనుకున్నట్లే వాళ్లు చాలా ముందుగా చర్చ్ దగ్గరకు వచ్చారు. ముందుగా సూచించిన ప్రదేశంలో కూర్చుంటున్న సంతోష్‌ని చూశారు. ఆ తరువాత చర్చ్‌లోకి ఎవరు వస్తున్నారో గమనించారు. వార్నర్ వచ్చి సంతోష్‌కి మూడు వరసల వెనుక కూర్చోవటంతో వారికి అనుమానం వచ్చింది. వార్నర్ తన దృష్టిని మరల్చకుండా సంతోష్‌నే చూస్తూ ఉండటంతో వారి అనుమానం బలపడింది.

మధ్యమధ్యలో వార్నర్ వెను తిరిగి తనతో వచ్చిన వారికి కళ్లతోనే ఏదో సందేశాలు ఇవ్వటం కూడా వారి దృష్టిని దాటి పోలేదు.

వార్నర్ స్వయంగా ఈ పని చేయటానికి సిద్ధమయ్యాడంటే అతను పెద్ద అధికారి అయి ఉంటాడని ఊహించారు. ఆ తరువాత ఫ్లోరెన్స్ తన పథకం అమలుపరచింది. నెమ్మదిగా లేచి వెళ్ళి వార్నర్ పక్కన కూర్చుంది. వార్నర్ ఎవరా అన్నట్లు ఈమె వైపు చూశాడు. “హాయ్! అయామ్ ఫ్లోరెన్స్...” అంటూ పరిచయం చేసుకుంది.

ముందు ప్రశ్నార్థకంగా చూశాడు వార్నర్. తరువాత తల ఎటూ కాకుండా ఊపి తన దృష్టిని సంతోష్ వైపు మరలించాడు.

"మీరు ఎవరి కోసం వచ్చారో, వారు ఎప్పటికీ రారు..." అంది ఫ్లోరెన్స్.

"నువ్వు ఎవరు? నేను ఎవరి కోసం వచ్చానని అనుకుంటున్నావు?"

"మీరు ఆజాద్ హింద్ ఫౌజు హెడ్‌క్వార్టర్ నుండి వస్తున్న ఏజెంట్లను పట్టుకోవటానికి ఇక్కడకు వచ్చారని కూడా నాకు తెలుసు. కానీ, వారిద్దరు ఎప్పటికీ రారు. ఎందుకంటే, వారు చనిపోయారు."

"నా మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పలేదు, ఎవరు నువ్వు?" ఇంకా ఆమెను అనుమానంగా చూస్తూ అడిగాడు వార్నర్.

"కోహిమాలో పని చేస్తున్న మింటో అనే రాయల్ ఎయిర్‌ఫోర్స్ అధికారి గురించి ఎప్పుడయినా విన్నారా?" ఎవరికీ ఇబ్బంది లేకుండా లోగొంతుకతో మాట్లాడుతోంది ఫ్లోరెన్స్.

"ఆ పేరు ఎందుకో విన్నట్లే ఉంది. కానీ ఏ సందర్భంలో విన్నానో గుర్తు రావటం లేదు."

"అతన్ని కోర్ట్ మార్షల్ చేశారు..."

"ఏ నేరం మీద?"

"ఒక టైగర్‌మోత్ విమానాన్ని అతని కూతురు దొంగతనంగా ఎగరేసుకు పోయింది. కూతురుకు ఇవ్వకూడని యాక్సెస్ ఇచ్చినందుకు..."

"గుర్తు వచ్చింది." ఉత్సాహంగా అన్నాడు వార్నర్. "మింటో ఒక సిన్సియర్ ఆఫీసర్. కానీ కూతురు చేసిన చిలిపి పని వలన అవమానానికి గురయ్యాడు. ఉద్యోగం కోల్పోయాడు. ఆ విషయం అప్పుడు క్లబ్‌లో చర్చకు వచ్చింది."

"ఆ టైగర్‌మోత్ ఎత్తుకు పోయిన కూతుర్ని నేనే..."

"మైగాడ్. నీమీద అరెస్ట్ వారంట్ ఉంది..."

"తెలుసు. మీకు నన్ను అరెస్ట్ చేస్తే ఉపయోగమా? ఇంతకాలంగా ఆజాద్ హింద్ ఫౌజు సైనిక శిబిరంలో ఉండివచ్చిన నేను ఇచ్చే సమాచారం ఉపయోగమా?"

నమ్మలేనట్లు ఆమె మొహం లోకి చూశాడు వార్నర్.

"ఎదురుగా కూర్చున్న వ్యక్తి వాళ్ల గూఢచారి అని నాకు తెలుసు. అతన్నీ, అతన్ని కలుసుకోవటానికి వచ్చే ఇద్దరు ఏజెంట్లను పట్టుకోవటానికి మీరు ఇక్కడ మాటు వేసి ఉన్నారనీ నాకు తెలుసు."

"ఇవన్నీ ఎలా తెలుసు?"

"అన్నీ ఇక్కడే మాట్లాడుకుందామంటారా?" నవ్వుతూ అంది ఫ్లోరెన్స్.

ఆ అమ్మాయి కూడా తన దేశస్థురాలవటంతో వార్నర్‌కి ఆ అమ్మాయిని అనుమానించాలని అనిపించ లేదు. "నాతో వస్తావా? నా ఇంటికి తీసుకు వెళ్తాను..." అన్నాడతను.

"ఎందుకు పోలీసులకు అప్పచెప్పటానికా?"

“కాదు. నువ్విచ్చే సమాచారం నిజంగా ఉపయోగకరమయింది అయితే బ్రిటిష ప్రభుత్వం నీకు ఋణపడి ఉంటుంది. నిన్ను ఇంగ్లండ్ పంపించే ఏర్పాటు కూడా నేను చేస్తాను. మనం మనం ఒకటి. ఈ బ్లడీ ఇండియన్స్ కోసం మనం బాధలు పడకూడదు…” అన్నాడతను.

“నేను రెడీ. కాకపోతే ఒకటే కండిషన్… నాతోపాటు నా స్నేహితురాలు ఒకామె ఉంది. ఆమె ఇండియన్. ఆమెను కూడా తీసుకువస్తే మీకేమీ అభ్యంతరం లేదుగా?”

“యూ ఆర్ వెల్కం…” అంటూ వార్నర్ లేచి నిలబడ్డాడు.

జంట హత్యల కేసులో ఒక ఆధారం లభించటంతో కోహిమాలో పోలీసుల ఉత్సాహం రెట్టింపయింది.

వెంటనే అచింత్ పనిచేస్తున్న బేకరీ దగ్గరకు చేరుకున్నారు వారు.

ఆ సమయంలో బేకరీ సరుకులు ఇవ్వటానికి ఊరిలోకి వెళ్లాడు అచింత్. బేకరీ ఓనర్ అదే విషయం చెప్పాడు.

ఇద్దరు పోలీసులు బేకరీలో కూర్చుంటే, మరో ఇద్దరు బేకరీ బయట నిలబడి అచింత్ వెనక్కి రావటం కోసం ఎదురు చూస్తున్నారు.

ఆజాద్ హింద్ ఫౌజు శిబిరాల్లో డోల్మాకు ఇచ్చిన శిక్షణలో ముఖ్య భాగం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండటం. బేకరీ మేడ మీద ఉన్న అచింత్ గదిలో కూర్చుని ఉన్న డోల్మా ఒకసారి కిటికీలో నుండి కిందకు చూసింది. ఆమెకు బేకరి బయట నిలబడి ఉన్న ఇద్దరు పోలీసులు కనిపించారు. ఉలిక్కిపడి తన తలను లోపలకు తీసుకుంది. పావుగంట తరువాత మరింత జాగ్రత్తగా కిందకు చూసింది. ఆ పోలీసులు ఇంకా అక్కడే ఉన్నారు. సగం మెట్లు దిగి కింద బేకరీలోకి తొంగి చూసింది. బేకరీ లోపల మరో ఇద్దరు పోలీసులు కూర్చుని కనిపించారు.

ఆమెకు వారు తమ కోసమే వచ్చారేమో అని అనుమానం వచ్చింది. కానీ… ఆలోచిస్తే అది నిజం కాదని అనిపించింది. జంట హత్యల కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకునే అవకాశం ఉందని ఆమెకు తెలుసు. కాకపోతే ఇంత త్వరగా హత్య చేసింది ఎవరో కనుక్కుని, తమను అరెస్ట్ చేయటానికి వచ్చే అవకాశం తక్కువ. ఏది ఏమయితేనేం వారికి అచింత్ మీద అనుమానం వచ్చింది. అచింత్ వచ్చిన తరువాత అతన్ని ఎంక్వయిరీ చేయటం ఖాయం. అతని గదిని కూడా వెతకవచ్చు. గదిలో అనుమానం వచ్చేది ఏమన్నా ఉందంటే అది రేడియో ఎక్విప్‌మెంట్ ఒకటే. దాన్ని వాళ్లు చూస్తే అచింత్‌ని అరెస్ట్ చేయటమే కాదు, తనను కూడా బంధిస్తారు. ఎలా అయినా రేడియో ఎక్విప్‌మెంట్ గదిలో నుండి మాయం చేస్తే ఎవరూ ఏమీ చేయలేరు.

ఆ మాట అనుకోవటం ఆలస్యం డోల్మా రేడియో పరికరాలు ఉన్న పెట్టె తీసుకుని వీపుకు తగిలించుకుంది. వెనుక వైపు ఉన్న మెట్ల మీదుగా కిందకు దిగి వచ్చింది. బేకరీ ముందు ఉన్న పోలీసుల కళ్ల ముందు నుండే నడుచుకుంటూ వెళ్ళి పోయింది.

మరికాసేపటికి అచింత్ పని పూర్తి చేసుకుని బేకరీకి వచ్చాడు. అతను రావటంతోనే పోలీసులు అతన్ని చుట్టు ముట్టారు. "ఫుటుబాల్ మ్యాచ్ రోజు నువు మైదానానికి వెళ్లావా, లేదా?" అని అడిగారతనిని.

"వెళ్లాను సార్..." చెప్పాడు అచింత్.

"మైదానంలో ఉన్న చెట్టు దగ్గర నిలబడ్డావు కదూ..."

"అవును..."

"మరి ఆ చెట్టు వెనుక రెండు హత్యలు జరిగితే నీకు ఎలా తెలియలేదు? అసలు నువ్వే ఆ హత్యలు చేశావనటానికి మా దగ్గర ఋజువులు ఉన్నాయి. ఏమంటావ్?"

ఏమీ మాట్లాడలేదు అచింత్.

"ఎక్కడ ఉంటావ్ నువ్వు?"

"మేడ మీద గదిలోనే ఉంటాడు..." చెప్పాడు బేకరీ ఓనర్.

"పద... ఒకసారి నీ గదిని చూద్దాం." అతని కాలర్ వదిలి దారి చూపించమన్నట్లు అన్నారు పోలీసులు.

అచింత్‌కి ఒక్కసారిగా మేడ మీద గదిలో ఉన్న డోల్మా గుర్తుకు వచ్చింది. దానితో పాటు గదిలో ఉన్న రేడియో పరికరం కూడా గుర్తుకు వచ్చింది. వాళ్ళు గదిని వెతకటం అంటూ జరిగితే తనను ఇక వదలరు. పైగా ఈ గొడవలో డోల్మా కూడా ఇరుక్కుంటుంది. అందుకే... దారి చూపిస్తున్నట్లు రెండడుగులు ముందుకు వేసి ఒక్కసారిగా బయటకు పరుగెత్తాడు.

బేకరీ లోపల ఉన్న పోలీసులు, "పట్టుకోండి, పట్టుకోండి..." అంటూ అరిచారు. బేకరీ బయట ఉన్న పోలీసులు అచింత్‌ని అడ్డుకోబోయారు. వారిని ఒక్క తోపు తోసి ముందుకు పరుగెత్తాడు అచింత్. నలుగురు పోలీసులు వెంటపడ్డారు.

అదే సమయంలో ఎదురుగా ఒక మిలటరీ జీపు వస్తోంది. అందులో ఉన్న ఆఫీసర్ కిందకు దిగి తన రివాల్వర్ బయటకు తీసి ఎదురుగా పరుగెత్తుకు వస్తున్న అచింత్‌కి గురి పెట్టాడు. అయినా అచింత్ ఆగలేదు. అతన్ని దాటుకుని ముందుకు పారిపోతున్నాడు.

అప్పుడు మిలటరీ ఆఫీసర్ పేల్చిన రివాల్వర్‌లోని గుండు అచింత్ భుజాల మధ్య దూరింది. బోర్లా పడిపోయిన అచింత్ మరి లేవలేదు.

ఆ తరువాత పోలీసులు వెనుతిరిగి బేకరీ దగ్గరకు వెళ్లారు. మేడ మీద ఉన్న అచింత్ గదిని క్షుణ్ణంగా వెతికారు. అయితే వారికి అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు. అయినా పోలీసులను చూసి పారిపోబోయాడంటే అతనే ఆ జంట హత్యలు చేసి ఉంటాడని వారు ఒక నిర్ధారణకు వచ్చి కేసు మూసేశారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS